
రోజంతా హాయిగా విహరించి తిరిగి తమతమ గూళ్ళు చేరుకుంటూన్న పక్షులు, ఆకాశంలో కిలకిల మంటూ ఏక సందడి చేస్తున్నాయి. చల్లగా వీస్తూన్న గాలికి పక్కనున్న చెట్లు తల ఊపుతూంటే, ఆ చెట్టు కొమ్మ చివర కూర్చున్న రెండు గువ్వలు, కువకువ లాడుతూ కులుకుతున్నాయి. పార్కు బెంచీ మీద కూర్చున్న గాయత్రికి, మామూలుగా అయితే ఆ పక్షులూ ఆ గాలీ, వళ్ళు తెలియని పులకరింతలు కలిగించి ఉండును. ఇప్పుడామె అవేవీ పట్టించుకొనే స్థితిలో లేదు. ఆమె దృష్టి ఎంత సేపటికీ పార్కు గేటుమీదే ఉంది.

నాలుగున్నరకల్లా వస్తానన్న శేఖర్, అయిదున్నర దాటిపోతున్నా ఇప్పటికింకా అయిపూ జాడా లేదు. ఎదురు చూసి చూసి గాయత్రికి విసుగొస్తోంది., అతను ఎప్పుడూ ఇంతే! అన్న టైముకి ఎప్పుడూ రాడు. 'ఏమిటిది?' అని విసుక్కుంటే ''ఆగ్రహించకు అందాల భామా! ఈ సారి తప్పక టైముకి వస్తాను,'' అంటూ చేతిలో చెయ్యేసి చెయ్యి ముద్దెట్టుకుంటాడు. దాంతో తనకి కోపం పోయి నవ్వు వస్తుంది.

ఇలా ఆలోచిస్తూన్న గాయత్రికి అప్పుడు మళ్ళీ నవ్వు వచ్చింది. సంతోషంతో వళ్ళంతా ఒక్కమారు ఝల్లుమంది. పైటని వయ్యారంగా సర్దుకుని, గాలికి ఎగురుతూన్న ముంగురుల్ని సుతారంగా సవరించుకొంది.



వాచీ చకచకా తిరిగిపోతోంది.

శేఖర్ ఇంకా రాకపోవడంతో సరదా స్థానంలో విసుగూ కోపం చోటు చేసుకోసాగాయి. చీకటి పడ్డాక యింటికి వెళితే అమ్మ తిడుతుంది. ''వయసొచ్చిన పిల్లవి. పెందరాళే ఇంటికి రావాలని తెలియదూ? ఇంతవరకూ ఏం రాచకార్యాలు వెలగబెడుతున్నావు? ఇరుగూ పొరుగూ ఏం అనుకుంటారు? అసలే మొగదక్షత లేని ఇల్లు, అందరికీ లోకువే'' అంటూ ఏవేవో తల్చుకుని బాధపడుతుంది.

అమ్మ చాదస్తం కానీ, ఈ రోజుల్లో ఎవరి గొడవ ఎవరు పట్టించుకుంటున్నారు? అయినా ఎవరి ఇష్టం వాళ్ళది. హాయిగా చదువుకొని ఎవరి కాళ్ళమీద వాళ్ళు బ్రతుకుతున్నప్పుడు ఒకరికి భయపడ్డం ఏమిటి, చాతకానితనం కాకపోతే! జీవితాన్ని ఎలా నడుపుకోవాలో ఇంకొకరు చెప్పాలా? ఎవరి మట్టుకు వాళ్ళకి తెలియదూ? ఆత్మ విశ్వాసంతో గాయత్రి ఎర్రని పెదవుల మీద తెల్లని చిరునవ్వు ఒకటి వెలిగింది. బద్ధకంగా ఆవులించి చిటికె వేసి, చేతిని ఉన్న వాచీ చూసుకుంది పావు తక్కువ ఆరు!

ఇంక ఇవ్వాల్టికి శేఖర్ రాడు! దీపాలు పెట్టకుండా ఇంటికి చేరుకోకపోతే అమ్మ ఊరుకోదు! లాభం లేదు. ఇంకా శేఖర్ కోసం ఎదురుచూడ్డం వట్టి ప్రయాస!

విసుగ్గా లేచి నుంచుని, చీరని అంటుకొన్న ఇసుకను జేబురుమాలుతో సుతారంగా దులుపుకొని బయలు దేరింది.

ఇంతలో ''లేటయింది కాదూ! ఐ యామ్ వెరీ సారీ!'' అంటూ చిరునవ్వుతో వచ్చాడు శేఖర్. గాయత్రి అతనికేసి కోపంగా చూసింది. మూతి తిప్పుకొంది. మాట్లాడకూడదనుకొంది. విసురుగా ముందుకి అడుగేసింది. చటుక్కున శేఖర్ ఆమె చెయ్యి పట్టుకొన్నాడు. పట్టుకుని ''కోపం వచ్చిందా?'' అంటూ బుజ్జగిస్తూ అడిగాడు.

గాయత్రి కోపం ఎక్కడి దక్కడ పోయింది.

''రాదేమిటి?'' అంది మూతి ముడుస్తూ.

''అసలు ఏం జరిగిందంటే...'' అంటూ సంజాయిషీ ఇచ్చుకోబోయాడు.

''ఆలశ్యంగా రావడం, ఏవేవో కల్లబొల్లి మాటలు చెప్పడం, మామూలేగా?''

# మరలు మళ్లిస్తే....?

పోలాప్రగడ రాజ్యలక్ష్మి



తీక్షణంగా అన్నా, గాయత్రి గొంతులో ఎగతాళి, కళ్ళలో నవ్వూ కనిపించాయి.

శేఖర్ గొంతు తగ్గించి "అదుగో! ఆ కళ్ళే నాకు కళ్ళెం వేసేవి! వాటిని పెదిమలతో అదుపులో పెడితే కానీ... " అన్నాడు గుండెల్లో తమకం అంతా మాటల్లో నింపుతూ.

"మరే! ఆశ! వెళ్ళి మీ పెద్దాళ్ళతో మాట్లాడి ముహూర్తం పెట్టించవు గానీ..." గోముగా అంది గాయత్రి.

"దానికి సంబంధించిన ప్లాను వేసేటప్పటికే లేటయింది... ఆ వివరాలు చెబుదాం అనే వచ్చాను..."


"పదు అలా మా యింటివేపు నడుస్తూ మాట్లాడుకుందాం— మా అమ్మ యీ పాటికప్పుడే నేనింకా యిల్లు చేరుకోలేదని వీధి గుమ్మం గేటు పట్టుకుని నుంచుని ఉంటుంది".........

"హాయ్! టా... టా..." అంటూ ఒక మగవాడి చేతిని తన చేత్తో పట్టుకుని నవ్వుతూ ఆ సంజ వెలుగులో వీధి మొగని వీడ్కోలు చెబుతూన్న కూతుర్ని మాసేసరికి సుజాతమ్మకి తన మాట్టా ఉన్న ప్రపంచం అంతా ఒక్కసారిగా గిర్రున తిరిగి కళ్ళు చీకట్లు కమ్మినట్లయింది. గుండెల్లోంచి ఓ పెద్ద మంట లాంటి భయం— కోపంతో మొహం జేవురించి పోయింది. గబగబా తడబడు తూన్న అడుగులతో వీధి మొగనుంచి వెనక్కి తన గుమ్మం దగ్గరికి వచ్చేసింది సుజాతమ్మ.

అనుకున్నంతా అయింది!

తను ఇలాంటిదేదో అవుతుందని భయపడుతూనే ఉంది.






చిన్నప్పటి నుంచీ, ఇట్టే ఆకర్షించే తెలివీ, చురుకూ, అందమూను గాయత్రిది. చదువుతోడయి, వయస్సు కూడా వచ్చేసరికి, బంగారపు బొమ్మలా కనిపిస్తోంది. చక్రాల్లాంటి గుండ్రని కళ్ళూ, పసిమి ఛాయా, ఒత్తైన జుట్టూ, గుండ్రని బుజాలూ, ప్రతి కదలికలోనూ నడకలోనూ ఓ క్రొత్తదనం, తల్లి అయిన తనే దిష్టి కొట్టేలా ఉంది. ఏ మగాడికన్నో చెదిరితే ఇంకేమైనా ఉందా? మగదక్షత కూడా లేని ఇల్లు, తను ధనవంతురాలయినా బాగుండును. యోగ్యమైన కుర్రవాడికిచ్చి పెళ్ళి చేసేసి ఉండును. ఏ రోజున ఏ అవాంతరం వచ్చి పడుతుందో అని రోజూ తను గండం లాగే గడుపుతోంది.

చివరికి తను భయపడినంతా అయింది.

ఎవరా కుర్రాడు! గాయత్రికీ అతనికీ మధ్యనున్నది కేవలం స్నేహమేనా? లేక...? సుజాతమ్మ గుండె ఒక్కమారు ఏ అగాధమైన లోయలోకో జారిపోయినట్లయింది. అనుకోని ప్రమాదం ఏదయినా జరిగితే ఇంకేమైనా ఉందా? బ్రతుకంతా చీకటి, భవిష్యత్తు అంతా శూన్యం.

శూన్యంలో నిండిన చీకటి!

చీకటిలో అలా నిస్తేజంగా ఉండిపోయింది.

కూనిరాగం తీసుకుంటూ గాయత్రి మెల్లగా తలుపుతోసి హాల్లోకి అడుగు పెట్టింది.

"ఆగు! ఇంత చీకటి పడే దాకా ఎక్కడి కెళ్ళావు?" హాలు దద్దరిల్లిపోయేలాగ అరిచింది సుజాతమ్మ.

ఆ కేకకి మొదట అదిరిపడి, తర్వాత పకపకా నవ్వి, "అదేవిటమ్మా అలా అరుస్తావు? స్నేహితులతో కబుర్లు చెబుతూ ఉంటే ఆలశ్యం అయింది అంతే!" అంటూ చేతిలో పుస్తకాలు షెల్ఫ్‌లో పడేసి, కుర్చీలో కూర్చుంది గాయత్రి.

"ఎవరా స్నేహితులు? మగా? ఆడా?" ఎంత కోపంతో అన్నా, ఆ మాటలో వ్యంగ్యం వెటకారం లేకపోలేదు. తల్లి అన్నమాటకి మొదట గాయత్రి గతుక్కుమంది. "శేఖర్ సంగతి అమ్మకి తెలిసిందా ఏమిటి?" బిత్తరపోయి చూసి, తల వంచుకుంది.

"మన స్థితిగతులు మరిచిపోయి ప్రవర్తించకు. డబ్బూ పలుకుబడి కల వాళ్ళు ఎలా ఉన్నా ఫరవాలేదు. తేడా ఏం వచ్చినా కప్పుకోగలరు. మన పరిస్థితి వేరు. ఇంట్లో మగదక్షతా లేదు. నేనా, పురాణాలో పుణ్యకథలో ఏవో చెప్పి నలుగురినీ మంచి చేసుకుని వాళ్ళు సంతోషంతో ఇచ్చినదాంతోటి సంసారాన్ని ఎలాగో నెట్టుకు వస్తున్నాను. నువ్వేమో మగపిల్లలతో స్నేహమూ మొగల్లో నుంచుని టా... టా... లు చెప్పడమూను..."

సుజాతమ్మ మాటలకి గాయత్రి గతుక్కుమంది.

అమ్మ చెప్పింది నిజమే! తమ స్థితిగతులు మరిచిపోయి తను శేఖర్‌తో చనువుగా ఉంటోంది. రానురాను ఆ చనువు విడదీయరాని బంధంగా మారుతోంది. మారుతోంది ఏమిటి? మారింది. ఇప్పటికే తమ స్నేహం చాలా దూరం వచ్చింది. అతణ్ణి చూడనది రోజు రోజుగా ఉండదు. ఏదో వెలితి దిగులు — పరధ్యానం. అతనికీ అంతే! "గాయత్రీ నిన్ను చూడని రోజున ఏదో పోగొట్టుకున్నవాడిలాగ అయిపోతాను" అని అతను ఎన్నిసార్లు అనలేదూ? కాలేజీ బ్యూటీగా తను ఎన్నికయి, ప్రిన్సిపాల్ తనని పూల కిరీటంతో అలంకరిస్తున్నప్పుడు, అతని కళ్ళు ఎలా మెరిసి పోయాయి? ఆ కళ్ళల్లో తన రూపు చూసుకుని తానెంత మురిసిపోయింది. ఆ సన్నివేశం తలుచుకుంటేనే ఇప్పుడు గుండెలు ఝల్లుమంటున్నాయి. శేఖర్‌దీ తనదీ ఎంత మధుర ప్రేమో ఎలా చెప్పడం?

"ఏం, మాట్లాడవేం?" గర్జించింది సుజాతమ్మ.

"అతణ్ణి నేను ప్రేమించానమ్మా! అతను కూడా నన్ను..." అంటూ గాయత్రి, తల్లి ఉగ్రరూపం చూసి మాట మధ్యలోనే ఆగిపోయింది.

"ఆహా! అంతవరకూ వచ్చిందీ! అయితే రేపట్నుంచి కాలేజీ మానెయ్యి. అసలు నిన్ను కాలేజీకి పంపడమే నేను చేసిన బుద్ధిపొరబాటు! ప్రేమించిందిట ప్రేమ. వాడెవరో — వాడి కులమేమిటో గోత్రమేమిటో, చదువూ సంధ్యా ఉద్యోగం సద్యోగం ఇవేమీ ఆలోచించనక్కర్లేదన్న మాట!".

"పవిత్రమైన ప్రేమకి ఇవన్నీ అడ్డంకులా?" గాయత్రి తనకి తెలియకుండా నిర్భయంగా అనేసింది.

"ఏవిటీ?... వ్యవహారం అంతదాకా వచ్చిందీ?... సరే రేపటి నుంచి కాలేజీ లేదు ఏం లేదు ఇంట్లో పడి ఉండు. సిగ్గూ సిరం, భయం భక్తీ అన్నీ వదిలేసినట్లుంది నీ వాలకం చూస్తే" అంటూ సుజాతమ్మ గాయత్రిని గదిలోకి నెట్టి తలుపు మూసేసి బయట గొళ్ళెం పెట్టేసింది. గదిలో కూర్చుని గాయత్రి విషాదంగా నవ్వుకొంది— "గదికి గొళ్ళెం వేశావు కానీ, మనస్సుకి గొళ్ళేలూ కళ్ళేలూ ఉండవమ్మా!", అనుకొంది. ఇంకో గంటకే సుజాతమ్మ తలుపు తీసి "స్నానం చేసిరా — అన్నం వడ్డిస్తాను" అంటూ ఆప్యాయంగా పిలిచింది గాయత్రిని. కాని గాయత్రి మాత్రం ఉలుకూ పలుకూ లేకుండా ఆ మట్టునే కూర్చుండిపోయింది.

ఆ తర్వాత నుంచి రోజూ అదే వరస!

తల్లి లేచి స్నానం చెయ్యమనడం — కూతురు లేవకపోవడం — బట్టలు మార్చుకో మంటే, "ఈ బట్టలు చాల్లెద్దూ" అంటూ విరక్తిగా జవాబు చెప్పడం — అన్నం దగ్గర కంచంలో చెయ్యి పెట్టుకుని ఆ మట్టునే కూర్చోవడం — ప్రొద్దస్తమానూ శూన్య దృక్కులతో ఏదో చూస్తూ పరధ్యానంగా కూర్చోవడం — రాత్రి తెల్లవార్లు నిద్దర పోక అటూ ఇటూ దొర్లుతూ నిట్టూర్పులు విడుస్తూ కన్నీళ్ళు తుడుచుకుంటూ కాలక్షేపం చెయ్యడం.

నెలకి నెలా ఎంతో ఓర్పుతో ఎదురు చూసింది. సుజాతమ్మ, కూతురు ప్రవర్తనలో ఏదైనా మార్పు వస్తుందేమోనని మార్పు రాలేదు సరికదా రోజు రోజుకీ మరింత ఆందోళనకరంగా తయారవుతోంది. సరిగ్గా తిండి తినక చిక్కి శల్యం అయింది. రాత్రింపగళ్ళు అలా ఆలోచిస్తూ కూర్చుని కూర్చుని చివరికి ఏం మతిపోగొట్టుకుంటుందో అనే భయం ఏర్పడింది సుజాతమ్మలో.

ఓ రోజున బతిమాలుతూన్న ధోరణిలో "నెల్లాళ్ళ బట్టీ చూస్తున్నాను. ఏవిటా వాలకం? చక్కగా లేచి నీళ్ళు పోసుకోవు. సరిగా అన్నం తినవు... ఇలా ఉంటే ఎలా చెప్పు?" అనడిగింది.

గాయత్రి సమాధానం ఏం చెప్పలేదు. కళ్ళెత్తి ఓ మారు చూసింది. ఆ చూపులో "పంజరంలో బంధించిన చిలుక ఇంతకంటే ఏం ఉత్సాహంగా ఉంటుంది?" అన్న భావం ద్యోతకం అయింది సుజాతమ్మకి.

"నా బంగారు కదూ? కడుపునిండా అన్నం తిని కంటి నిండా నిద్రపో."

"అన్నం సయించడంలేదు. నిద్ర రావడం లేదు. నన్నేం చెయ్యమంటావు?" విసుగ్గా అంది గాయత్రి.

"ఇలా అయితే మతి పోతుందే!" బాధ కోపం విసుగూ మిశ్రమంగా వినిపించాయి సుజాతమ్మ గొంతులో.

"ఇక ముందు పోయేదేం లేదు — ఇప్పటికే పోయింది" అంటూ తనలో తాను గొణుక్కున్నట్లు అంది గాయత్రి కళ్ళల్లో కనిపించే నీటి తెర తల్లికి కనిపించకుండా ముఖాన్ని మరో వైపుకి త్రిప్పి.

కూతురు కంఠంలో వినిపించిన విషాద ఛాయ విని తటాలున దగ్గరికి వెళ్ళి ఆమె తలని తన గుండెలకి అదుముకుని వెంట్రుకలు నిమురుతూ "ఎందుకు తల్లీ మనస్సుని అంత విరక్తిగా మార్చుకుంటావు? ఆ కుర్రాణ్ణి మరిచిపో నేను మరో మంచి సంబంధం చూసి నీకు పెళ్ళి చేస్తాను. పెళ్ళి చేసుకుని హాయిగా కాపురానికి

# ఢిల్లీ నగరం

ఎన్ని సామ్రాజ్యాల వికాస వినాశాలకు
ప్రేక్షకురాలై నిలిచిందో ఈ మహానగరం!
ఎన్ని విజయ పరాజయ పరంపరలకు కేళీరంగమై
శతాబ్దాల గాథలు హృదయంలో మౌనంగా భరిస్తూ
యమునాతీరాన విరిసిందో ఈ మహానగరం!
ఆశానిరాశలు రాగమాలికలు
ఆలపించే మహితవిపంచి ఈ నగరం
విభిన్న భూమికలు ధరించి విచిత్ర వ్యక్తులు
విభ్రమాభినయాలు చేసి చీకటి తెరచాటుకు తొలగిన
విస్మయావహ నాటక రంగం ఈ నగరం
జీర్ణ శిథిలాలలో ఝల్లుమనే కీచురాళ్లదీనాలాపాలు
చీకటి గుబుర్లలో మిణుగురుల తళుకుల కులుకులు
మానవులను పావులుగా చేసే చదరంగమాడే
అదృశ్యకాల హస్త విన్యాసాలు!

ఎందరెందరు శూరులు, ధీరులు
శాంతిదూతలు, కాంతి దాతలు
భవితవ్య నిర్ణేతలు, మహానేతలు,
శ్రేయోమార్గ ప్రస్థానంలో అడుగులు వాల్చిన దివ్యదూతలు,
నవరాజ్య నిర్మాతలు, ఆనందసంధాతలు
విశ్రాంతెరుగని కర్మవీరులు, ధర్మయోధులు
భోగలాలసులు, త్యాగ జీవనులు
సామాన్యులు, మాన్యులు, ధన్యులు
ఎందరో ఈ తల్లి ఒడిలో
యమునా తరంగాల జోల పాటలో
శాశ్వత నిద్రలో మునిగిపోయారో!

ఎంత త్రవ్వినా తరగని చరిత్ర సంపదకు
అక్షయ భాండాగారం ఈ నగరం

ఎన్నో మధుర గాథలకు చైత్ర రథం
ఎన్నో బాధల బ్రతుకుల శిశిరపథం
ఎన్నెన్నో వైభవ ప్రాభావాలకు
విజయ విన్యాస విలాసాలకు
విస్మయ విశాలమౌన నయనాల సాక్షి!
ఈ నగర చంచలాక్షి!
కాలపు అడ్డుగోడను దాటి
అలనాటి సమున్నత భవన గోపురాలు
ఈనాటి సుందర సౌధాలతో కరచాలనం చేసే
అద్భుత సమన్వయం

భాగ్యలక్ష్మి తూగాడిన బంగరు డోలిక
ఎన్నెన్నో సామ్రాజ్యాల శాశ్వత సమాధి వాటిక
ఎన్నో భాషల రమ్య స్వరమేళ
ఎన్నో వేషాల విచిత్ర మధుర హేల
బహుళ వర్ణసుమ సురభిళ హారం
భారత మంగళ మందిర ద్వారం!

—అమరేంద్ర

వెళితే, ఈ బెంగా విరక్తీ అన్నీ పోతాయి" అంది సుజాతమ్మ ఓదార్పుగా.

"పెళ్ళి అంటూ జరిగితే నాకు శేఖర్‌తోనే జరగాలి. అలా కానప్పుడు నేనసలు పెళ్ళే చేసుకోను. నాలుగు గోడల మధ్యా బందీగా జీవితం గడపను. స్వేచ్ఛగా నా ఇష్టం వచ్చినట్టు ఉంటాను. ఇంక నా గొడవ నువ్వు పట్టించుకోకు."

కూతురు గొంతులో ఓ తెగింపు ఓ దృఢమైన నిశ్చయం ధ్వనించాయి.

ఇలా వదిలేస్తే పిల్ల ఏ అఘాయిత్యమేనా చెయ్యొచ్చు లేదా, పరిస్థితి చెయ్యిజారి పోవచ్చు. వాడెవరో దీని మతి చెడగొట్టేశాడు. దీని దృష్టి మరల్చాలి... మనస్సుని ఇంకో వేపు మళ్ళిస్తే తప్ప, పిల్ల పరిస్థితి అదుపు తప్పిపోతుంది.

ఇలా ఆలోచించి ఆలోచించి తెగ మథనపడి చివరికి సుజాతమ్మ ఓ నిశ్చయానికొచ్చింది. వచ్చి, "గాయత్రీ! లేచి స్నానం చేసి బట్టలువేసుకో! కళ్యాణ మండపంలో నాలుగు రోజుల నుంచి బాబా గారెవరో ఉపన్యాసాలిస్తున్నారట. జనం వందలాది వెళ్ళి వస్తున్నారు. వేదాంత విషయాలు బాగా చెబుతున్నారట. మనంకూడా వెళదాం" అంది.

"కావలిస్తే నువ్వు వెళ్ళి విను నాకెందుకు ఆ వేదాంతాలూ, ఉపన్యాసాలు?" అని విసుక్కుంది గాయత్రి.

"మనస్సు బాగా లేనప్పుడే భగవద్విషయాలూ, వేదాంతం, మరీ అవసరం. ఇవాళ ఒక్క రోజు వచ్చి విను. నీకు నచ్చకపోతే రేపటి నుంచి రావొద్దులే" అంది సుజాతమ్మ.

గాయత్రి కూడా ఆలోచించింది.

మతి పోగొట్టుకుని ఇంట్లో కూర్చుంటే మాత్రం ఏం లాభం.

వాళ్ళ వాళ్ళతో మాట్లాడి, నాలుగు రోజుల్లో వచ్చి, అమ్మని కలుసుకుని, ఒప్పించి తనని పెళ్ళి చేసుకుంటానని మాట ఇచ్చిన శేఖర్, నెల్లాళ్ళు దాటి పోతున్నా ఇప్పటికి అజా పజా లేడు.

అందరి మగాళ్ళలాగే ఇతనూ అన్నమాట!

మాటలతో మనస్సు నింపే మనిషి!

మొదటి నుంచి ఇంతే తను గ్రహించలేక పోయింది. కాని, చెప్పిన ప్రకారం ఎప్పుడు ప్రవర్తించాడు అతను ఫలానా రోజున ఫలానా చోట కలుసుకుందాం అని చెప్పి, తీరా ఆ రోజు అక్కడికి వచ్చేవాడు కాదు. వచ్చినా గంటో రెండు గంటలో ఆలస్యంగా రావడమే! ఎదురు చూసి చూసి తను విసిగి పోతే, వచ్చి ఏవో నాలుగు కల్లబొల్లి కబుర్లు చెప్పి సముదాయించేవాడు.

ఇలాంటి వాడిని నమ్మి తను మోసపోయింది.

అవును! నిజంగా మోసపోయింది!

ఎందుకింకా అతని గురించి ఆలోచించి ఆలోచించి మనస్సు పోగొట్టుకోవడం?. దాంతో ఒక నిర్ణయానికొచ్చింది. లేచి రెడీ అయి, "పద అమ్మా వెళదాం" అంది.

కూతురులో వచ్చిన మార్పుకి సుజాతమ్మ సంతోషించింది. తల్లీ కూతుళ్ళిద్దరూ కళ్యాణ మండపంలోకి అడుగుపెట్టేటప్పటికే, భక్తులందరూ బాబాగారి దర్శనం చేసుకుని శెలవు తీసుకుని, ఇళ్ళకి తిరిగి వెళుతున్నారు. అప్పుడే ఉపన్యాసం పూర్తి అయింది. బాబాగారు విశ్రాంతి తీసుకుంటున్నారు. ముగ్గురు నలుగురు ముఖ్యులూ ఒకళ్ళిద్దరు శిష్యులూ తప్ప ఎవరూ లేరు.

సుజాతమ్మ సాష్టాంగపడి బాబాగారి కాళ్ళకి నమస్కారం పెట్టింది. గాయత్రిని కూడా అలాగే చేయమంది. గాయత్రి మాత్రం నిలబడే, నమస్కారం పెట్టకుండా చూస్తూ ఉండిపోయింది. సుజాతమ్మ కళ్ళతో గద్దించినా గాయత్రి లెక్క చెయ్యలేదు. పైగా నిర్లక్ష్యంగా చూసింది, ఓ మారు తల్లికేసీ, మరో మారు

బాబాకేసీను.

బాబాగారు మరీ వృద్ధుడేం కాదు.

అలాగని యువకుడూ కాదు.

ముప్ఫయి నలభై యేళ్ళ మధ్య నడివయస్కుడుగా ఉన్నారు. కాషాయ బట్టల్లో పచ్చగా మిసమిసలాడుతూ మెరిసిపోతున్నారు. ముఖంలోనూ కళ్ళల్లోనూ ఆకర్షణీయమైన వర్చస్సూ దివ్యమైన కాంతీను. అందరి సన్యాసులు లాగా పాంకోళ్ళు వేసుకోలేదు. ఖరీదైన చెప్పులున్నాయి కాళ్ళకి. చేతిని రిస్టువాచీ రోజూ గెడ్డంగీసుకోవడం వల్ల ఏర్పడ్డ నల్లని ఆనమాలు, ముఖానికి ఓ కొత్తఅందాన్నిస్తోంది. అసలే అందమైన కళ్ళు — రిమ్‌లెస్ కళ్ళజోడులోంచి మరింత అందంగా కనిపిస్తున్నాయి.

గాయత్రి బాబాని పరిశీలనగా చూస్తూన్న సమయంలో, బాబా కూడా గాయత్రి కేసి తీక్షణంగా తేరిపార చూశారు. యౌవన భారంతో మరులుగొన్న మనస్సు వేధించడంవల్ల మధనపడి ఉందేమో, ఏ అలంకరణలూ లేని శరీరం, నిద్రాహారాలు లేక బడలి, ఎండ వేడికి వడిలి వాడిన మాలతీ లతలాగా ఉంది. ఏ చిరుగాలి తాకిడికైనా ఒరిగిపోవచ్చు. ఏ మాత్రపు పలకరింపుకేనా, కారుమేఘాలు లాంటి ఆ కాటుక కళ్ళు జలజలా వర్షించేటట్లు ఉన్నాయి. ఆ కళ్ళని చూసేసరికి బాబాగారికి అవ్యక్తమైన అభిమానం, ప్రేమా, జాలీ ముప్పిరిగొన్నాయి. వాత్సల్యం ఉట్టి పడేలాగ కళ్ళతోటే కూర్చో అని గాయత్రిని మృదువుగా శాసించారు.

అంతే!

మంత్ర ముగ్ధలాగా బాబా సమీపానికి వెళ్ళి మఠం వేసుకుని కూర్చుంది. ఆ తర్వాత ధ్యానంలోకి వెళుతూన్న దానిలా కళ్ళుమూసుకుంది. కళ్ళు మూసుక్కూచున్నాక గాయత్రిలో దాదాపు చలనం లేదు. చుట్టూ ఉన్న పరిస్థితినే కాదు, తన గతాన్నీ, తననీ కూడా మరచిపోయి యోగ సమాధిలోకి వెళ్ళిపోయినట్లుంది. బాబా ముఖంలో కనిపిస్తూన్న వెలుగు లాంటిదే ఆమె ముఖంలో కూడా కనిపించింది అక్కడున్న నలుగురైదుగురికీ.

"మృద్ఘట ఇవసుఖ భేద్యో దుస్సంధానశ్చ దుర్జనో భవతి
సుజనస్తు కనక ఘటవా దుర్భేదశ్చసుసంధాయ"

అన్నారు బాబా అర్ధనిమీలితలోచనలాతో ఆలోచనామగ్నులై సుజాతమ్మతో సహా చుట్టూ ఉన్న నలుగురు బాబాగారన్న సంస్కృత శ్లోకానికి అర్థం తెలియక ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. కాస్సేపటికి బాబాగారే కళ్ళు తెరిచి వాళ్ళ ముఖాలు పరిశీలించి చిరునవ్వు నవ్వి, "అర్థం చెబుతాను వినండి" అన్నారు:

"అల్పులు మట్టికుండల వంటి వారు. మట్టికుండని పగలగొట్టడం ఎంతో సులభం. అతకడం అసాధ్యం. సజ్జనులు బంగారు కుండల వంటివారు. బంగారు కుండ సాధారణంగా పగలదు, పగిలినా సులభంగా అతకవచ్చు."

బాబాగారు "అల్పులు" అన్నప్పుడు తమ అందరికేసీ చూడ్డం, "సజ్జనులు" అన్నప్పుడు కళ్ళు మూసుక్కూచున్న గాయత్రికేసి దృష్టి సారించడం గమనించింది సుజాతమ్మ. బాబాగారికి గాయత్రి పట్ల ఏర్పడ్డ సద్భావానికి ఎంతో సంతోషించింది.

తర్వాత కాస్సేపటికి బాబాగారి దగ్గర శెలవు తీసుకుని "రా అమ్మా వెళదాం" అంటూ గాయత్రిని కుదిపి లేపింది సుజాతమ్మ. గాయత్రి కళ్ళు తెరిచింది. అవి ఎంతో తేజోవంతంగా మెరిసిపోతున్నాయి. లో వెలుగులు చూసిన సాధకుని అంతర్ చక్షువుల్లా ఉన్నాయి. "వెళదాం" అంటూ తన జబ్బ పట్టుకున్న తల్లి చేతిని విదిలించుకొని "ఎక్కడికి?" అంది విరక్తిగా.

సుజాతమ్మ కంగారు పడి "అదేవిటే తల్లీ! ఇంటికి! మనింటికి" అంది.

"జీవుడికి ఏదీ ఇల్లు కాదు — భగవత్సన్నిధానమే నిజమైన ఇల్లు" అంటూ నిబ్బరంగా సమాధానం ఇచ్చింది గాయత్రి.

సుజాతమ్మ అదిరిపడింది.

గుండె జారినట్లు అనిపించింది.

"అవేం మాటలే! ఏమైందే తల్లీ నీకు?" అంటూ ఏడుస్తూ, పైట నోట్లో కుక్కుకొని బాబాగారి వైపు చూసింది సుజాతమ్మ దీనంగా, బాబాగారు చిరునవ్వు నవ్వి తల పంకించి, "ఆమెని ఇక్కడ ఉండనీ — నువ్వెళ్ళు" అన్నారు.

సుజాతమ్మ నోటికి గుప్పెళ్ళు అడ్డం పెట్టుకుని చేసేదేం లేక, తన వస్తువుని పారేసుకుని వెళ్ళిపోతున్నట్లు మనస్సు విలవిల్లాడుతూంటే, భారంగా అతి భారంగా అడుగు కదిపింది.

ఇంటికెళ్ళి తలుపు తీసింది.

గాయత్రిలేని ఇల్లు బావురుమంటూ కన్పించింది.

సుజాతమ్మకి దుఃఖం ఆగలేదు.

బాధ తీరేలాగ గట్టిగా ఏడ్చేసింది...

అలా ఏడ్చి ఏడ్చి కళ్ళు ఉబ్బిపోయి శూన్యంగా చూస్తూ కూర్చున్న సుజాతమ్మకి, తూరుపు దిక్కున వెలుగు రేకలు తొడచడం కానీ, ఊరంతా మేల్కొని సందడిగా మారడం కానీ, తన యింటి ముందు ఓ రిక్షా ఆగడం కానీ, ఆ రిక్షాలోంచి ఒక యువకుడు దిగి తన వైపు నడచి రావడం కానీ తెలియనేలేదు.

గడప అవతల ఆగిపోయి "అమ్మా, సుజాతమ్మ గారు మీరేనాండీ?" అనడిగాడు ఆ యువకుడు.

ఆ ప్రశ్నతో సుజాతమ్మ ఈ లోకంలోకి వచ్చింది. వచ్చి, అవునన్నట్లు తలూపి, లేచి కళ్ళు తుడుచుకొని, ఆ యువకుడిని లోపలికి వచ్చి కూర్చోమంది.

అతను కూర్చుంటూ "నా పేరు శేఖర్, నేనూ మీ అమ్మాయి గాయత్రీ ప్రేమించుకున్నాం, పెళ్ళి చేసుకుందాం అనుకున్నాం. ఈ లోపుగా నేను అర్జంటుగా మా ఊరు వెళ్ళడం, మా కుటుంబ పరిస్థితులు తారుమారు కావడం, తర్వాత నేను ఉద్యోగం వెతుక్కోవలసిరావడం, అందులో స్థిరపడి మా వాళ్ళని ఒప్పించి వచ్చేసరికి ఇన్నాళ్ళు పట్టింది. మీరు అంగీకరిస్తే గాయత్రి, నేను పెళ్ళి చేసుకుంటాం. పెళ్ళి ప్రజంటేషన్‌గా తన చిత్తరువు ఒకటి వేసి పట్టుకొచ్చాను. ఎన్నాళ్ళ నుంచో తన బొమ్మ వేస్తాను అని అంటూ వచ్చాను. ఇన్నాళ్ళకి కుదిరింది. ఇదుగో — గాయత్రికి ఈ కలర్ ఇష్టమని ఈ కలర్‌లో చీరకూడా పట్టుకొచ్చాను. గాయత్రి ఏదీ?" అంటూ గబగబ మాట్లాడేస్తూన్న ఆ యువకుడికేసి ఆశ్చర్యంగా చూసింది సుజాతమ్మ. ఆ చూపులో అభినందనా ఆనందం రెండూ మిళితం అయి ఉన్నాయి.

మాట్లాడకుండా నిలబడ్డ సుజాతమ్మని చూసి ఆందోళనతో, "మాట్లాడరేమండీ! మా పెళ్ళి మీ కిష్టం లేదా? గాయత్రి ఏదీ?" అన్నాడు అటూ ఇటూ చూస్తూ.

"నాయనా మీదింత పవిత్రమైన బంధం అనీ, గాయత్రిని నువ్వింత గాఢంగా ప్రేమించావనీ నాకు తెలియదు. అయినా ......"

"ఊ... అయినా...?"

"నువ్వు ఆలశ్యంగా వచ్చావు బాబూ! ఒక్క రోజు ముందు వచ్చినా గాయత్రి నీకూ నాకూ దక్కేది..."

"అంటే...? గాయత్రి చనిపోయిందా? నా గాయత్రి చనిపోయిందా?" అంటూ శేఖర్ చేతిలో చిత్ర పటాన్నీ చీర తీసుకుని స్మశానం వైపు పరిగెట్టబోయాడు.

అతణ్ణి వెంబడించి పరిగెడుతూ "అటు కాదు నాయనా... ఇటూ... ఇటూ..." అంటూ సుజాతమ్మ శేఖర్‌తో కలిసి పరుగు పరుగున కళ్యాణ మండపానికి వచ్చింది.

అక్కడ బాబా కాని, భక్తులు కాని ఎవ్వరూ లేరు.

కళ్యాణ మండపం ఖాళీగా ఉంది.

సుజాతమ్మకి ఒక్కమాటు గుండె గుభేలుమంది.

తలుపులు తాళాలు వేస్తూన్న వాచ్‌మన్‌ని "నాయనా! ఇక్కడ బాబా గారుండాలి! ఏరీ?" అనడిగింది.

"ఓ గంట క్రితమే కళ్యాణ మండపం ఖాళీ చేసి ఏ ఊరో వెళ్ళిపోయారు. కారుల్లో" అన్నాడు వాచ్‌మన్.

బ్రతుకంతా కూలిపోయి సర్వమూ కోల్పోయిన నిర్భాగ్యురాలి లాగా అక్కడే ఏడుస్తూ పడిపోయింది సుజాతమ్మ. అంతే — రక్తప్రసరణ ఆగిపోయింది.

స్మశానంలో మండుతూన్న చితిలో తను తెచ్చిన చిత్రపటమూ చీరా రెండూ పడేసి, "ఎందుకిలా అయింది? గాయత్రీ! మన బంగారు బంధాన్ని ఎందుకిలా తెంచేశావు?" అంటూ ఏడుస్తూ నిలబడ్డ శేఖర్ చెవుల్లోకి, ఎక్కడి నుంచో వచ్చి వినబడింది, "సుజనస్తు కనకఘటవా..." అనే శ్లోకం విషాదంతో కూడిన స్పష్టాస్పష్ట శబ్దాలతో—

*